క్లుప్తంగా

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్ గ్రామ శివారులోని వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను అధికారులు మంగళవారం పరిశీలించారు. వాగు పరీవాహక ప్రాంతంలోని విద్యుత్ మోటార్లు, ఓవర్ లోడ్, గతంలో కాలిన ట్రాన్స్ ఫార్మర్లు, కెపాసిటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఇక్కడ ఎస్ఈ ఆపరేషన్ జగిత్యాల సత్యనారాయణ, డీఈ ఆపరేషన్ మెట్‌పల్లి పి.తిరుపతి, ఏడీఈ ఆపరేషన్ కోరుట్ల ఆంజనేయరావు, రూరల్ ఏఈ శ్రీనివాస్, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

భూమిపూజ



భూమిపూజ చేస్తున్న అర్చకుడు కిషన్ శర్మ

ఇబ్రహీంపట్నం : దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని వేములకుర్తిలో భజరంగ్‌దళ్ శివాజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మండప ఏర్పాటుకు అర్చకుడు రొట్టె కిషన్ శర్మ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో అంకతి శేఖర్, కుంచల వెంకట్‌రాజ్, అనిల్, అరుణ్, శ్రీనివాస్, మల్లేశ్, ఉదయ్, వెంకటేశ్, భరత్, దేవదాస్, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గం

కోరుట్ల: పట్టణంలోని గంభీర్‌పూర్ పద్మశాలీ వెల్ఫేర్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోతు బుచ్చయ్య, ఉపాధ్యక్షుడిగా గుంటుక నాథం, ప్రధాన కార్యదర్శిగా గజం శంకర్, కోశాధికారిగా చిలువేరి గంగేశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు అలువాల సత్యనారాయణ, వాసాల రాజగంగారాం తెలిపారు. నూతన కార్యవర్గాన్ని సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు.

రక్తదాతకు సన్మానం



వినోద్‌కుమార్‌ను సన్మానిస్తున్న డాక్టర్ సంజయ్

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్‌కు చెందిన వెలుల్ల వినోద్ కుమార్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ సన్మానించారు. వినోద్ కుమార్ ఇప్పటివరకు 33 సార్లు రక్తదానం చేశాడని, రక్తదానం ప్రాణదానంతో సమానం అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పిడుగు రాధాసందయ్య, పలువురు యువకులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు పంపిణీ

ధర్మపురి : ఆర్థికంగా వెనుకబడిన పేద కుటుంబాలకు అందిస్తున్న ఉచిత కుట్టుమిషన్లను సద్వినియోగం చేసుకోవాలని యాదవ ఫౌండేషనర్ కోలుముల దామోదర్ కోరారు. కోలుముల స్వర్ణలత జన్మదినం సందర్భంగా కోలుముల దామోదర్ యాదవ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం ఉచిత కుట్టుమిషన్ల పంపిణీతో పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఇన్‌చార్జి వేల్పుల నాగరాజు, జిల్లా నాయకులు సంపత్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశ్, పెద్దపెల్లి జిల్లా యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి నాగరాజు, ధర్మపురి మండల అధ్యక్షుడు సంఘ నర్సింహులు, వేల్పుల శ్రీలత, తదితరులున్నారు.

'నాదేశం - నా మట్టి'

ధర్మపురి : పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మేరా మిట్టి, మేరా దేశ్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కస్తూరి ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి ఆలయంలో 'నాదేశం నామట్టి' కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అసెంబ్లీ కో కన్వీనర్ బండారి లక్ష్మణ్, నాయకులు ఓరుగంటి చంద్రశేఖర్, చింతకింది అనసూర్య, మర్రిపెల్లి సత్యం, సంగెపు గంగారాం తదితరులున్నారు.

ఉచిత విద్యుత్ ఉత్తదేనా ?

- విద్యుత్ బిల్లుల మోతతో లాండ్రీ సెలూన్ నిర్వాహకుల గందరగోళం
- ఉచిత విద్యుత్ పథకం కింద 681సెలూన్లు, 1677 లాండ్రీషాపులు



కథలాపూర్ (వేములవాడ): కులవృత్తులపై ఆధారపడి జీవనం సాగించే నాయీ బ్రాహ్మణులు, రజకులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్ కొన్ని రోజులకే పరిమితమైందా అని వారు వాపోతున్నారు. లాండ్రీషాపులు, సెలూన్లకు నెలకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించింది. ఇందుకు సంబంధించిన బిల్లులను ప్రతీనెలా విద్యుత్ శాఖకు ప్రభుత్వం చెల్లించింది. 2021లో ప్రవేశపెట్టిన ఈ పథకానికి ఇటీవల బిల్లులు చెల్లింపులు నిలిచిపోవడం.. నిర్వాహకులే బిల్లులు చెల్లించాలని ట్రాన్స్‌కో అధికారులు తెలపడంతో గందరగోళానికి గురవుతున్నారు. లేదంటే కనెక్షన్లు తొలగిస్తామని ట్రాన్స్‌కో సిబ్బంది అంటున్నారని నిర్వాహకులు చెబుతున్నారు.

జిల్లాలో 2,358 విద్యుత్ కనెక్షన్లు

జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు, 20 మండలాలుండగా 380 గ్రామాలున్నాయి. ఆయా గ్రామాల్లో, పట్టణాల్లో 681 సెలూన్‌షాపులు, 1,677 లాండ్రీ షాపులు ఉచిత విద్యుత్ కనెక్షన్ పరిధిలో ఉన్నాయి. పథకం ప్రారంభంలో కొన్నినెలలు ఉచిత విద్యుత్ సక్రమంగా అమలు చేశారని నాయీ బ్రాహ్మణులు, రజకులు తెలిపారు. ఆరెడు నెలలుగా విద్యుత్ బిల్లుల మోతతో నోటీసులు ఇవ్వడంతో ఉచిత విద్యుత్ కొన్నిరోజులకే పరిమితం చేశారంటూ ప్రభుత్వం తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొందరు బిల్లులు అధికంగా చెల్లించాల్సి ఉందంటూ కనెక్షన్లు కట్ చేస్తామని ట్రాన్స్‌కో సిబ్బంది తెలపడంతో షాపుల యజమానులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం చొరవ చూపి లాండ్రీ, సెలూన్ షాపుల ఉచిత విద్యుత్‌ను అమలుచేయాలని వాటి యజమానులు కోరుతున్నారు.

యథావిధిగా అమలుచేయాలి



సెలూన్ షాపుకు ఉచిత విద్యుత్‌కోసం దరఖాస్తు చేసుకుంటే ట్రాన్స్‌కో సిబ్బంది మీటర్ బిగించారు. ఈనెలలో రూ. 2,293 విద్యుత్ బిల్లు చెల్లించాలని నోటీస్ ఇచ్చారు. రోజంతా కష్టపడితే రూ. 200 వచ్చే పరిస్థితి లేదు. వేలాది రూపాయల విద్యుత్ బిల్లులు ఎలా చెల్లించాలి. ఉచిత విద్యుత్ యథావిధిగా అమలు చేయాలి.

– కోరుట్ల రాజేశ్, చింతకుంట

ప్రభుత్వమే భరించాలి



లాండ్రీ షాపులకు ఉచిత విద్యుత్ అంటే కనెక్షన్ తీసుకున్నా. గతనెలలో రూ. 900 బిల్లు వస్తే చెల్లించా. ఇప్పుడు రూ.2వేలు వచ్చింది. నెలనెలా బిల్లులు చెల్లించిన తర్వాత ఉచిత విద్యుత్ ఎట్లా అమలు చేసినట్లవుతుంది. దుస్తులు ఇస్త్రీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నా. ప్రభుత్వం ఉచిత విద్యుత్ భారాన్ని భరించాలి.

– బొట్ల గంగారాం, కోరుట్ల

250 యూనిట్ల వరకే ఉచితం



నాయీ బ్రాహ్మణులు, రజకులకు షాపుల కోసం నెలకు 250 యూనిట్ల వరకు మాత్రమే ఉచిత విద్యుత్ పథకం వర్తిస్తుంది. 250 యూనిట్లు దాటితే యజమానులే బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. అంతకంటే తక్కువ వినియోగించినవారికి అధిక బిల్లులు వస్తే ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకువస్తే సమస్యను పరిష్కరిస్తాం.

– సత్యనారాయణ, ట్రాన్స్‌కో ఎస్ఈ, జగిత్యాల

గ్యారంటీ పథకాలతో అన్నివర్గాలకు న్యాయం



మేడపల్లి సత్యంకు మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

మల్యాల: కాంగ్రెస్ గ్యారంటీ పథకాలతో అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని, ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని మానాల గ్రామంలో మంగళవారం గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలు ఆయనకు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఇంటింటా తిరుగుతూ కాంగ్రెస్ గ్యారంటీ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.2లక్షలు రుణమాఫీతోపాటు రూ.500లకే సిలిండర్, ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు అందజేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఇంటి స్థలంతో పాటు నిర్మాణానికి రూ.6లక్షలు అందజేస్తామన్నారు. మహిళలకు ప్రతినెలా రూ.2500 ఇస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంగ ఆనంద రెడ్డి, దారం ఆదిరెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, గంగాధర్, సతీశ్‌రెడ్డి, శనిగరపు తిరుపతి, నలువాల సంజీవ్, మల్లయ్య, బుచ్చిరెడ్డి, మల్లేశం, వినయ్, ఇమామ్, హుస్సేన్,శంకర్, శ్రావణ్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా జోనల్‌స్థాయి పోటీలకు ఎంపిక



వర్షిణి



కృష్ణవేణి

రాయికల్: జిల్లాస్థాయి అండర్ 17 బాలికల వాలీబాల్ పోటీల్లో రాయికల్‌లోని కేంబ్రిడ్జి హైస్కూల్‌కు చెందిన స్తంభం వర్షిణి, తాట్లవాయి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన లావుడ్య కృష్ణవేణి కరీంనగర్‌లో జరిగే ఉమ్మడి జిల్లా జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థినులను కేంబ్రిడ్జి హైస్కూల్ ప్రిన్సిపాల్ హఫీజ్, పీఈటీ మచ్చ చంద్రకళ అభినందించారు.

'అసత్య ప్రచారాలు మానుకోవాలి'

బుగ్గారం: ప్రభుత్వ పథకాలపై అసత్య ప్రచారాలను మానుకోవాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు జెడ్పీటీసీ బాదినేని రాజేందర్ హితవు పలికారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడుగు బలహీనవర్గాల వారికి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అందజేస్తుంటే ఎన్నికల కోడ్ పేరిట ఇబ్బందులు సృష్టించడం తగదన్నారు. బుగ్గారంలో ప్రభుత్వ కార్యాలయాలకు శంకుస్థాపన చేయకుండా పార్టీ కార్యకర్తలతో అల్లర్లు సృష్టించడం సమంజసం కాదన్నారు. ఇలాంటి పనులు చేస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ సుచేందర్, నాయకులు గాలిపెల్లి మహేశ్, మూల శ్రీనివాస్‌గౌడ్, అబ్దుల్ రహమాన్, రామకృష్ణ, పలు గ్రామాల సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధిని ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న లోక బాపురెడ్డి

కథలాపూర్: గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి కోరారు. మంగళవారం మండలకేంద్రంలో బీఆర్ఎస్ మండలస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రతీ కార్యకర్త, నాయకులు శ్రమించాలన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి ఇంటా ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిపొందినవారే ఉన్నారన్నారు. ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలని నాయకులను కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గడీల గంగప్రసాద్, ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ దాసరి గంగాధర్, ఎంపీటీసీలు బొడ్డు బాలు, కొండ ఆంజనేయులు, సర్పంచ్ ఎంజీ రెడ్డి, నాయకులు గడ్డం భూమారెడ్డి, మామిడిపెల్లి రవి, కొత్తపెల్లి శ్రీనివాస్, గడ్డం శేఖర్‌రెడ్డి, దొప్పల జలందర్, ఆకుల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం షురూ..



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి రాధిక

జగిత్యాల: ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో అధికార పార్టీ అప్పుడే ప్రచారం షురూ చేశారు. మంగళవారం 21వ వార్డులో ఇంటింటి ప్రచారంలో భాగంగా జగిత్యాల ఎమ్మెల్యే సతీమణి రాధిక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గంగసాగర్ పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

కథలాపూర్: ఎన్నికల నియమావళిలో భాగంగా జగిత్యాల– రాజన్న సిరిసిల్ల జిల్లాల సరిహద్దు మండలంలోని కలిగోట గ్రామశివారులో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మంగళవారం చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. చెక్‌పోస్టు వద్ద నిరంతరం పోలీస్ అధికారుల నిఘా ఉంటుందని ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నిబంధనలు పాటించి పోలీస్‌శాఖకు సహకరించాలని ఎస్సై పేర్కొన్నారు.

17న హుండీ లెక్కింపు

సారంగాపూర్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బీర్‌పూర్ శ్రీలక్ష్మీ నృసింహస్వామి హుండీ లెక్కింపును ఈనెల 17న నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10 గంటలకు హుండీ లెక్కింపు ప్రారంభమవుతుందని భక్తులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఘన నివాళి



చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

కోరుట్ల: పట్టణంలోని సమాజ్‌వాదీ పార్టీ కార్యాలయంలో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ములాయం సింగ్ యాదవ్ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఎండీ రషీద్‌ఖాన్, నాయకులు హరీశ్ యాదవ్, ఆరీఫ్‌ఖాన్, ఖైరత్ అలీ, అజీం అలీ, ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

నాయకుల విగ్రహాలకు ముసుగు



ఇబ్రహీంపట్నం : చాకలి ఐలమ్మ విగ్రహానికి ముసుగు వేయించిన అధికారులు



సారంగాపూర్‌లో ..



రాయికల్ : గోడలపై రాతలు చెరిపేస్తున్న సిబ్బంది

ఇబ్రహీంపట్నం : ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికారులు మండలంలోని జాతీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయిస్తున్నారు. మంగళవారం మండలకేంద్రంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, చాకలి ఐలమ్మ, సుభాష్‌చంద్రబోస్‌తో పాటు పలు విగ్రహాలకు గుడ్డతో ముసుగులు వేశారు. గోడలపై రాతలు ఉంటే వాటిపై సున్నం వేయిస్తున్నారు. శిలాఫలకాలున్న చోట వాటిపై పేపర్ అతికించారు.

సారంపూర్‌లో..

సారంగాపూర్: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో వివిధ శాఖల అధికారులు వారి పరిధిలోని కార్యాలయాలు, ఇతర కార్యక్రమాలపై పూర్తి ఆంక్షలు విధిస్తున్నారు. సారంగాపూర్ ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో బెల్టుషాపులపై దాడులు నిర్వహించి ఎనిమింది మంది నిర్వాహకులపై కేసులు నమోదు చేయగా, బీర్‌పూర్ ఎస్సై గౌతంపవార్ మండలంలో బెల్టుషాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజాప్రతినిధుల ఫొటోలను తొలగించారు. ఆయా గ్రామాల్లో జాతీయ నాయకుల విగ్రహాలపై ముసుగులు వేయించారు.

ఫ్లెక్సీల తొలగింపు..

రాయికల్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్తులపై ఉన్న వాల్ రైటింగ్స్, ఫ్లెక్సీలను ఎన్నికల కోడ్ నేపథ్యంలో తొలగించినట్లు మున్సిపల్ కమిషనర్ సంతోష్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులపై ఎలాంటి రాజకీయ పార్టీలకు చెందిన వాల్‌రైటింగ్స్ రాయవద్దని, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దని సూచించారు.

గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు ముసుగు చేయాలి

ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో జాతీయ నాయకుల విగ్రహాలకు ముసుగు ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించినా పట్టణంలో మాత్రం మున్సిపల్ అధికారులు అవేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు ముసుగు వేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా బస్‌షెల్టర్





వెల్గటూర్: మండలంలోని శాఖాపూర్ గ్రామంలో బస్‌షెల్టర్ ప్రమాదకరంగా మారింది. సీసీ రోడ్డు, సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనుల్లో భాగంగా కప్పారావుపేట, శాఖాపూర్ కూడలిలో ఉన్న బస్‌షెల్టర్ మధ్యలో నుంచి డ్రైనేజీ కోసం బ్లాస్టింగ్ చేసి తవ్వడంతో బస్‌షెల్టర్ పూర్తిగా శిథిలమై కూలిపోయే స్థితికి చేరింది. ఈ కూడలి నుంచి మొక్కట్రావుపేట, ముత్తునూర్, చెగ్యాం, రాంనూర్ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఈ బస్‌షెల్టర్‌లోనే వేచి ఉంటారు. శిథిలమైన బస్‌షెల్టర్‌ను తొలగించి కొత్తది నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

కార్యదర్శులతో సమావేశం

పెగడపల్లి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో పుల్లయ్య, ఎంపీవో మహేందర్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎన్నికల నియమావళిపై కార్యదర్శులతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి యాజమానుల అనుమతి లేకుండా వాల్ రైటింగ్ చేయరాదన్నారు. దేశ నాయకుల విగ్రహాలపై ముసుగులు వేయాలని, రాజకీయ నాయకుల ఫొటోలు, ఫ్లెక్సీలు, పార్టీల జెండాలను తొలగించాలన్నారు.

నిలిచిన బతుకమ్మ చీరల పంపిణీ

- మండలంలో ఇప్పటివరకు 9,500 మందికి చీరల పంపిణీ
- మిగతావి పంపిణీ చేయకపోవడంతో నిరాశ చెందుతున్న మహిళలు



మండల పరిషత్ కార్యాలయంలో బతుకమ్మ చీరలు

పెగడపల్లి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో మండలంలో బతుకమ్మ చీరల పంపిణీ నిలిచిపోయింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి బతుకమ్మ పండుగకు ప్రభుత్వం ఆడబిడ్డలకు చీరలు పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. మండలంలో 23 గ్రామ పంచాయతీలున్నాయి. 17వేల బతుకమ్మ చీరలు అవసరముండగా మొదటి విడుతగా 9,500 చీరలు ఈనెల 7న రాగా అధికారులు మహిళలకు పంపిణీ చేశారు. మిగతా 7వేల చీరలు సోమవారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చాయి. అప్పటికే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికారులు పంపిణీ చేయలేకపోయారు. ఎన్నికల కోడ్ కారణంగా మండలంలో 7వేల మంది మహిళలకు అందకుండా పోయాయి. దీంతో చీరలు రాని మహిళలు నిరాశకు గురవుతున్నారు. తమకు కూడా చీరలు అందించేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులను కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో పుల్లయ్యను సంప్రదించగా మండలానికి 17,500 చీరలు అవసరముండగా నాలుగు రోజుల క్రితం 10,500 చీరలు వచ్చాయని వాటిని పంపిణీ చేశామన్నారు. మిగతా 7వేల చీరలు సోమవారం సాయంత్రం మండలానికి రాగా అప్పటికే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంపిణీ నిలిపివేసినట్లు తెలిపారు. చీరలు అందని మహిళలకు ఎన్నికల కోడ్ ఎత్తివేసిన అనంతరం పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

అధ్వానంగా బీటీ రోడ్డు



మెట్‌పల్లిరూరల్: మండలంలోని పెద్దాపూర్ క్యాంప్, ఇస్కాన్ ఆలయానికి వెళ్లే బీటీ రోడ్డు అధ్వానంగా తయారైంది. దారి పొడవునా కంకర తేలడంతో పాటు పలు చోట్ల గుంతలు ఏర్పడంతో ఆ మార్గం గుండా వెళ్లే వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు దృష్టి సారించి మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా గొయ్యి



దూలూర్ గ్రామశివారులో రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

కథలాపూర్: మండలంలోని దూలూర్– బొమ్మెన గ్రామాల మధ్య తారురోడ్డుపై గొయ్యిలు ప్రమాదకరంగా మారినా అధికారులు పట్టించుకోకపోవడం లేదు. వీటిని వాహనచోదకులు గమనించకుండా వెళ్తుండటంతో ప్రమాదాలకు గురవుతున్నారు. మరోవైపు బొమ్మెన శివారులో ఇటీవల కురిసిన వర్షాలకు వంతెన వద్ద రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. నెలల తరబడి మరమ్మతు చేయకపోవడంపై రెండు గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రోడ్లు, భవనాలశాఖ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.